ప్రజారోగ్యానికి 'సురక్ష'తో భరోసా

ఎంపీ వల్లభనేని బాలశౌరి



పెనమలూరు వైద్య శిబిరంలో వైద్య సేవల వివరాలు తెలుసుకుంటున్న ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే పార్థసారథి, కేడీసీసీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి

పెనమలూరు: జగనన్న ఆరోగ్య సురక్ష.. ప్రజారోగ్యానికి భరోసా ఇస్తోందని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి తెలిపారు. పెనమలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ప్రారంభించారు. సర్పంచి లింగాల భాస్కరరావు అధ్యక్షతన జరిగిన సభలో ఎంపీ వల్లభనేని బాలశౌరి మాట్లాడుతూ మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకం తీసుకు వచ్చి ప్రజలకు అండగా నిలిచారన్నారు. కుటుంబాల్లో అనారోగ్య పరిస్థితి వస్తే ఆస్తులు అమ్మి వైద్యం చేయించడంతో కుటుంబాలు ఆర్థికంగా చితికి పోతున్నాయని వైఎస్సార్ గుర్తించే.. ఆరోగ్యశ్రీ పథకాన్ని తీసుకువచ్చి చరిత్రలో నిలిచిపోయారని చెప్పారు. మహానేత ఆశయాలకు అనుగుణంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండడుగులు ముందుకేసి రాష్ట్రంలో వైద్యాన్ని అన్ని వర్గాలకు అందుబాటులోకి తీసుకు వచ్చారన్నారు. ప్రతి ఇంట్లో అనారోగ్యంతో ఉన్న వ్యక్తులను గుర్తించి క్షేత్రస్థాయిలో వైద్యం అందించడానికే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తాను కేంద్ర ప్రభుత్వ నిధులు (సీఎస్ఆర్) రూ.5 కోట్లతో జిల్లాలో పలు ప్రభుత్వ ఆస్పత్రులలో సిటీస్కాన్, ఎంఆర్ఐ స్కాన్, రక్తపరీక్షలకు పరికరాలు ఏర్పాటు చేశానన్నారు. మరో నెల రోజుల్లో రూ. 2 కోట్లతో క్యాన్సర్ పరీక్షలకు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసి గ్రామాల్లో స్క్రీనింగ్ పరీక్షలు చేయిస్తాని చెప్పారు. పెనమలూరు పాఠశాలకు రూ.కోటి నిధులతో ప్రత్యేక డిజిల్ తరగతులు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.

అందరికి ఉచిత వైద్యం

రాష్ట్రంలో అందరికి ఉచిత వైద్యం అందించడానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. నేడు ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండటానికి, వ్యాధులు రాకుండా జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. రాష్ట్రంలో 1.67 కోట్ల కుటుంబాలకు.. ఐదు వేల మందికి పైగా వైద్యులు అన్నిరకాల పరీక్షలు చేసి ఉచితంగా 172 రకాల మందులు ఇస్తున్నారన్నారు. పేదలకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో సంపూర్ణ వైద్య సేవలను ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై జాగ్రత్తగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, జెడ్పీ సీఈవో జ్యోతి బసు, నియోజకవర్గ ప్రత్యేకాధికారి, ఎస్ఈ పీఆర్ విజయకుమారి, మండల ప్రత్యేకాధికారి ఎ.శ్రీనివాసరావు, మైక్రో ఇరిగేషన్ పీడీ రాజ్యలక్ష్మి, ఎంపీడీఓ సునీతాశర్మ, ఏవో లోయ శివశంకర్, మండల వైద్యాధికారి బిజిలీ శ్రీనివాస్, ఈవోపీఆర్డీ కోరా శ్రీనివాసరావు, చోడవరం సర్పంచి కాకర్ల వెంకటరత్నం, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ రామినేని రమాదేవి, ఏఎంసీ డైరెక్టర్లు కొడాలి సుష్మ, మండూరు కోటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నేతలు కొత్తపల్లి వెంకటేశ్వరరావు మాదు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. కేడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి దంపతులు ఎంపీ, ఎమ్మెల్యేలను ఘనంగా సన్మానించారు.



సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ, కోట్లు తదితరులు



ఈదుపుగల్లు-2 సచివాలయంలో మందులు ఇస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు బాకీబాబు తదితరులు

రామవరప్పాడు: రూరల్ మండలం నిడమానూరు సచివాలయం -1 పరిధిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించి సుమారు 500 మందికి వైద్య పరీక్షలు చేశారు. శిబిరాన్ని ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, జెడ్పీటీసీ సువర్ణరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు, సర్పంచ్ శీలం రంగారావు ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రకాష్‌నాథ్, ఎండీఓ భార్గవి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

కంకిపాడు: మండలంలోని ఈదుపుగల్లు-2 సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ సుధా ప్రసూజ, డాక్టర్ సుందర్‌కుమార్‌తో కూడిన వైద్య బృందం రోగులకు వైద్య సేవలు అందించారు. 504 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, ఏఎంసీ మాజీ చైర్మన్‌మద్దాలి రామచంద్రరావు, మాజీ ఎంపీపీ మాదు శ్రీహరిరాణి, ఎంపీటీసీలు బూరగ బాలాజీ, షేక్ అమీనాబి, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ రామినేని రమాదేవి, అగ్రిబోర్డు డైరెక్టర్ నకరికంటి శేఖర్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



చిన్నారికి అత్యవసర వైద్యం అందిస్తున్న వైద్య సిబ్బంది



మందులు అందిస్తున్న సిబ్బంది

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం ఎ.సీతారామపురంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో బాపులపాడు, వీరవల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ ఎంజే మంజూష, డాక్టర్ కిరణ్మయి నేతృత్వంలోని వైద్యుల బృందం గ్రామస్తులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. 729 మంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ, బాపులపాడు జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, ఎంపీడీవో కె.జోగేశ్వరరావు, ఎ.సీతారామపురం సర్పంచ్ గణేష్, మాజీ సర్పంచ్ మక్కా స్టాలిన్ పాల్గొన్నారు.

పెనమలూరు: గంగూరు ఏఆర్‌నగర్ సచివాలయం పరిధిలో జరగనున్న సురక్ష శిబిరంలో గ్రామస్తులు వైద్య సేవలు పొందాలని సూచించారు.

కంకిపాడు: మండలంలోని ఈదుపుగల్లు-1 సచివాలయంలో ఈనెల 11వ తేదీ ఉదయం 9 గంటలకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి బి.వెంకటేశ్వరరావు తెలిపారు.

ఉంగుటూరు: పెద అవుటపల్లి గ్రామ సచివాలయం -2లో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శేషగిరి రావు తెలిపారు. ఎమ్మెల్యే వంశీ పాల్గొంటారని పేర్కొన్నారు.

పేదల సంక్షేమమే లక్ష్యం

గన్నవరం రూరల్: పేదల సంక్షేమమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ అన్నారు. మంగళవారం మండలంలోని గొల్లనపల్లి గ్రామ సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు జరిగింది. ఎమ్మెల్యే శిబిరం ప్రారంభించిన అనంతరం సర్పంచ్ గణపవరపు శాంతి అధ్యక్షతన జరిగిన సభలో మాట్లాడారు. ఈ ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. 3200 వ్యాధులకు పైగా ఆరోగ్య శ్రీ ద్వారా వైద్యం అందిస్తున్నారని, ఈ క్యాంపుల్లో వ్యాధులను గుర్తించి ఉన్నత వైద్యానికి రిఫర్ చేయడం ద్వారా ప్రజలను ఆరోగ్యవంతులుగా చూడటానికి జగనన్న ఆరోగ్య సురక్ష ఏర్పాటు చేశారన్నారు. ఉన్నత వైద్యం, విద్య ఉచితంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్ణ పేదలకు అందజేస్తున్నారన్నారు. ఏఎంసీ చైర్మన్ రామిశెట్టి అంజనీకుమారి, ఎంపీడీవో ఇ.సత్యకుమార్, ఎంపీపీ అనగాని రవి, జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్ రాణి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ గౌసాని, ఎంపీటీసీ సభ్యురాలు మోరం నాగరాణి, పెద అవుటపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి హిమబిందు, డాక్టర్ కరిముల్లా, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య, జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు పోలిమెట్ల జయరాజు తదితరులు పాల్గొన్నారు. శిబిరంలో 459 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.



గొల్లనపల్లిలోని వైద్యశిబిరంలో పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వంశీమోహన్, నాయకులు

క్లుప్తంగా

ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రికి రూ.50 వేలు విరాళం



హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం కానుమోలులోని ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి అభివృద్ధికి విజయ నర్సింగ్ విద్యా సంస్థల అధినేత తట్టి అర్జునరావుకు రూ.50 వేల విరాళాన్ని అందించారు. ఆ మొత్తాన్ని విజయవాడలోని ఆయన కార్యాలయంలో ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ కె.వాహినికి అందజేశారు. ఆయుర్వేద ఆస్పత్రిలో సౌర విద్యుత్ వ్యవస్థ ఏర్పాటుకు ఈ మొత్తాన్ని వెచ్చించనున్నట్లు డాక్టర్ వాహిని తెలిపారు. ఇప్పటికే ఆస్పత్రి అభివృద్ధికి ఆయుష్ శాఖ రూ.5 లక్షల నిధులు మంజూరు చేయడంతో చురుగ్గా పనులు సాగుతున్నాయి. దాతల సాయంతో సోలార్ విద్యుద్దీకరణకు చర్యలు చేపట్టినట్లు డాక్టర్ వాహిని తెలిపారు.

టిడ్కో డైరెక్టర్‌కు ఎంపీ పరామర్శ



పెనమలూరు: పోరంకిలో నివసిస్తున్న టిడ్కో డైరెక్టర్ పి.రాఘవరావును మంగళవారం మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి పరామర్శించారు. కొన్నిరోజుల క్రితం రాఘవరావుకు గుండె ఆపరేషన్ చేశారు. ఆయన కోలుకుంటున్నారు. పోరంకికి వచ్చిన ఎంపీ బాలశౌరి.. రాఘవరావు ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

అభయాంజనేయస్వామి సన్నిధిలో అన్నదానం

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం విశేష పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో 200 మంది భక్తులకు అన్నదానం జరిగింది. దాత సూరే రత్నారెడ్డి, రవణమ్మ దంపతులు ఆర్థిక సహకారం అందజేశారు. దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గాప్రసాద్, ఆలయ పాలక మండలి చైర్మన్ నెరుసు భూషణం, ఈవో కూచిపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

గన్నవరం ప్రభుత్వాస్పత్రికి శ్రమదాన్ ప్రశంసా పత్రం

గన్నవరం: మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా ఈ నెల 1వ తేదీన స్వచ్ఛతాహీ సేవలో భాగంగా స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో శ్రమదాన్ నిర్వహించినందుకు ప్రశంసా పత్రం లభించింది. స్వచ్ఛ భారత్ మిషన్ ప్రశంసా పత్రం జారీ చేసినట్లు ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ మన్నే సుందరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆస్పత్రి ప్రాంగణాన్ని జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్‌రాణి, వైద్య సిబ్బందితో కలిసి పరిశుభ్రంగా తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు. ఆస్పత్రిలో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. అందరి సమష్టి కృషి ఫలితంగానే ఆస్పత్రికి ప్రశంసా పత్రం లభించినట్లు వివరించారు.

రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి



పెనమలూరు: రైతులు యాజమాన్య పద్ధతులు పాటించి తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించాలని జిల్లా వనరుల కేంద్రం(డీఆర్సీ) శాస్త్రవేత్త సుధారాణి అన్నారు. వణుకూరులో మంగళవారం రైతులకు యాజమాన్య పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సుధారాణి మాట్లాడుతూ రైతులు ఎరువులు, పురుగు మందులు తక్కువగా వాడాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనలపై ఎరువులు, పురుగుల మందులు వాడాలని తెలిపారు. సాగులో సరైన యాజమాన్య పద్ధతులు పాటించడంతో రైతులు తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించడానికి అవకాశం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు జ్యోతిరమణి, పద్మజ, ఏడీ సునీల్, మండల వ్యవసాయాధికారి కె.శైలజ, రైతులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ప్రస్తుతం మొక్కలు నాటితేనే భవిష్యత్ తరాలకు చక్కటి పర్యావరణాన్ని అందించగలరని ఆదాయపు పన్ను శాఖ విజయవాడ సర్కిల్-1 డెప్యూటీ కమిషనర్ ఏ.తాండవ కృష్ణమూర్తి చెప్పారు. లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ జూబ్లీ హరిత, పానసోనిక్ డిజిటల్ స్టోర్స్, ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో మొక్కలు నాటడం, పర్యావరణ పరిరక్షణ ర్యాలీ మంగళవారం జరిగింది. మారుతీనగర్ నుంచి ప్రారంభమైన ర్యాలీ ఎస్ఆర్ఆర్ కళాశాల వరకు సాగింది.

నిబంధనల మేరకే విద్యుత్ బిల్లులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: నియమ, నిబంధనల మేరకే విద్యుత్ బిల్లులు విధిస్తున్నామని, దీనిపై అపోహలకు తావు లేదని సీపీడీసీఎల్ హనుమాన్‌జంక్షన్ ఏఈ ఎ.శ్రీనివాసరావు మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. మీటర్లు ఆగిపోవడం లేదా కాలిపోయిన సందర్భాల్లో నెలసరి యావరేజ్ యూనిట్లకు బిల్లు జారీ చేస్తారని చెప్పారు. ఎవరైనా విద్యుత్ వినియోగదారులు బిల్లులో ఎక్కువ రుసుం వస్తున్నట్లుగా భావిస్తే ఫిర్యాదు చేయవచ్చని ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. విద్యుత్ అధికారుల పరిశీలన తర్వాత అదనపు బిల్లు వచ్చినట్లు నిర్ధారణ జరిగితే నిబంధనల ప్రకారం బిల్లు మొత్తాన్ని సరిచేస్తామని వివరించారు.

విజయవంతంగా మెగా ఆరోగ్య మేళాలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా జిల్లాలో మెగా ఆరోగ్య మేళాలు విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని తెలిపారు. ఆమె మంగళవారం విజయవాడ రూరల్ మండలంలోని నిడమానూరు 1 విలేజ్ హెల్త్ క్లినిక్ పరిధిలో నిర్వహించిన మెగా ఆరోగ్య మేళాలు పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ అందుతున్న వైద్య సేవలను రోగులను అడిగి తెలుసుకున్నారు. శిబిరంలో అందిస్తున్న సేవలపై అందరూ సంతృప్తి వ్యక్తం చేశారు. అంతేకాకుండా తమ గ్రామానికి పెద్ద డాక్టర్లు వచ్చి పరీక్షలు చేస్తున్నారంటూ హర్షం వ్యక్తం చేశారు. అనంతరం దాములూరు విలేజ్ హెల్త్ క్లినిక్‌లో నిర్వహిస్తున్న ఆరోగ్య మేళాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా శిబిరాల్లో ఉన్న వైద్యులు నిరంజన్, విజయ పలు సూచనలు ఇచ్చారు. మెగా ఆరోగ్య మేళాల్లో గైనకాలజీ, పిడియాట్రిక్, ఈఎన్‌టీ, ఆర్థోపెడిక్ స్పెషలిస్ట్ వైద్యులు పాల్గొంటున్నందున ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

చిన్నారులకు ఖురాన్ కంఠస్థ పోటీలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): దైవ గ్రంథం ఖురాన్ ఔన్నత్యాన్ని అందరికీ తెలియజేసేందుకు తమ సంస్థ ఆధ్వర్యంలో ఖురాన్ కంఠస్థ పోటీలు నిర్వహిస్తున్నట్లు యునైటెడ్ ఫోరం ఫర్ ఖురానిక్ స్టడీస్ చైర్మన్ మహమ్మద్ దావూద్ తెలిపారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. ఈ ఏడాది కూడా పాఠశాల స్థాయి నుంచి పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. బుధవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో గ్రామ స్థాయి నుంచి ఈ పోటీలు జరుగుతాయన్నారు. అనంతరం పోటీల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఫోరం ప్రతినిధులు పాల్గొన్నారు.

మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం

సావరగూడెంలో తొలగనున్న ఇబ్బందులు

గన్నవరం రూరల్: మూడున్నర దశాబ్దాలుగా పడుతున్న ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపారు. సావరగూడెం బీసీ కాలనీలో మురుగు సమస్యతో ఇంతకాలం స్థానికులు అవస్థలు ఎదుర్కొన్నారు. ఇవి తొలగాయి. 1980వ దశకంలో ఈ కాలనీలో 60మందికి నివేశన స్థలాలు మంజూరయ్యాయి. అక్కడ ఇళ్లు నిర్మించుకున్న కుటుంబాలు మురుగు ముందుకు కదలక ఇక్కట్లు పడుతున్నాయి.

కాలనీలో ఇళ్లు తక్కువ ఎత్తులో నిర్మించడం స్థానికులకు శాపంగా మారింది. ఆ తర్వాత సిమెంటు రోడ్లు నిర్మించారు. వాటికి కూడా తూములు నిర్మించకుండా రోడ్లు పోయడంతో ఎక్కడి మురుగు అక్కడే నిలిచేంది. గ్రామంలోకి అధికారులు, ప్రజాప్రతినిధులు ఎప్పుడు వచ్చినా ఈ సమస్య వారికి స్వాగతం పలికేది. దీనికి శాశ్వత పరిష్కారానికి ఎమ్మెల్యే వంశీమోహన్ పలుసార్లు ప్రయత్నించారు. స్థానికుల ఇబ్బందిని తీవ్రంగా పరిగణించిన ఆయన సర్పంచ్ అట్ల నాగేశ్వరరావును పరిష్కారం సూచించాలని కోరారు.



సావరగూడెంలో మురుగు వెళ్లడానికి నిర్మించిన డ్రెయిన్

సర్పంచి పొలంలో డ్రెయిన్ నిర్మాణం

కాలనీ నుంచి సర్పంచ్‌కు చెందిన పొలంలో డ్రెయిన్ నిర్మించి బీసీ కాలనీ మురుగునీరు ప్రధాన రహదారి వెంట ఉన్న కాలువలోకి మళ్లించడమే పరిష్కారంగా చర్చించారు. వంశీ ఆదేశాలతో సర్పంచ్ బీసీ కాలనీ నుంచి లక్షలాది రూపాయలు విలువ చేసే సొంత భూమిలో రూ.25 లక్షలు వెచ్చించి శాశ్వత డ్రెయినేజీ నిర్మించారు. కాలనీలో నివసిస్తున్న గ్రామస్తులకు ముందుగా మురుగు పోయే మార్గం చూపించారు. దీంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులుగా కాలనీలోని 4 ప్రధాన రహదారులు, 5 మధ్య రహదారులు మధ్య ఉన్న 60 ఇళ్ల నుంచి వచ్చే మురుగును ఈ కాలువలోనికి మళ్లించడానికి చర్యలు తీసుకున్నారు. మురుగు ఒక్కచోటకు వచ్చే విధంగా, శాశ్వత డ్రెయినేజీ ద్వారా బయటకు పంపడానికి చర్యలు తీసుకున్నారు. సర్పంచ్ అట్లనాగేశ్వరరావు, సచివాలయం కార్యదర్శి బెజవాడ చైతన్య స్థానిక నివాసులను చైతన్యం చేసి మురుగు మళ్లింపుకు చర్యలు తీసుకున్నారు. సీసీరోడ్లను మిషన్‌లతో కట్ చేసి తూములు ఏర్పాటుకు రంగం పూర్తి చేశారు. 35సంవత్సరాల నుంచి మురుగు అవస్థలు అనుభవిస్తున్న బీసీ కాలనీ వాసులు వాటి నుంచి బయటపడినట్లే ఈ ప్రాంతవాసులు అంటున్నారు.



కాలనీలో రోడ్ల మధ్య వేయనున్న తూములు

డ్రెయిన్ నిర్మించడం ఆనందంగా ఉంది



15 ఏళ్లగా ఇక్కడ ఉంటున్నాను. మురుగునీరు, దోమలతో ఇబ్బందులు పడుతున్నాం. ఆ ఇబ్బందులు తీర్చడానికి శాశ్వత డ్రెయిన్ నిర్మించటం, మురుగునీరు బయటకు పంపేందుకు చర్యలు తీసుకోవటం ఎంతో ఆనందంగా ఉంది.

–పొన్నూరు రవి, బీసీ కాలనీ నివాసి

35 ఏళ్ల ఇబ్బందులు తీరినట్లే..



మురుగు నీరు తొలగించడానికి శాశ్వత నిర్మాణం చేశారు. అంతర్గతంగా డ్రెయిన్ అనుసంధానం చేస్తున్నారు. 35 ఏళ్లగా పడుతున్న ఇబ్బందులు తొలగనున్నాయి.

–కరేటి వెంకటరమణ, కాలనీ వాసి

దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

15 నుంచి శ్రీతిరుపతమ్మ ఆలయంలో నవరాత్రులు

గన్నవరం: స్థానిక శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకు శ్రీ దేవి శరన్నవరాత్రులను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ చెప్పారు. ఆలయంలో మంగళవారం దేవీ శరన్నవరాత్రుల మహోత్సవాల ఆహ్వాన పత్రికను ఆలయ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాస్తి మాట్లాడుతూ.. 15న శ్రీబాల త్రిపురసుందరీదేవి, 16న శ్రీగాయత్రిదేవిగా, 17న శ్రీఅన్నపూర్ణాదేవి, 18న శ్రీమహాలక్ష్మీదేవి, 19న శ్రీమహాచండీదేవి, 20న శ్రీసరస్వతీదేవి, 21న శ్రీలలితత్రిపురసుందరీదేవి, 22న శ్రీదుర్గాదేవి, 23న శ్రీమహిషాసురమర్ధినిదేవి, శ్రీరాజరాజేశ్వరీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. ఉత్సవాల్లో నిత్యం కుంకుమార్చనలు, లలిత సహస్రనామ పారాయణం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తుల కోసం ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. ఆలయ కమిటీ కార్యదర్శి జాస్తి నాని, కోశాధికారి జాస్తి ఫణిశేఖర్, సభ్యులు చిమట శ్రీనివాసరావు, పొట్ల శివలీల, జాస్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రికలు ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మానసిక ఆరోగ్యంతోనే చక్కని విజయాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మానసిక ఆరోగ్యంతో ఉన్నప్పుడే విద్యార్థులు చక్కని విజయాలను సొంతం చేసుకుంటారని ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ ఆర్కే అయోధ్య అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని 'మానసిక ఆరోగ్యంతోనే సంపూర్ణ ఆరోగ్యం' అంశంపై ఆ కళాశాల ప్రాంగణంలో మంగళవారం సాయంత్రం సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యవక్తగా హాజరైన డాక్టర్ ఆర్కే అయోధ్య మాట్లాడుతూ ఇటీవల మానసిక ఆరోగ్యంపై ప్రపంచ వ్యాపితంగా ప్రాధాన్యత పెరిగిందన్నారు. విద్యార్థులు మానసిక సమస్యలతో సతమతమవ్వకుండా దానికి అవసరమైన కౌన్సెలింగ్ లేదా చికిత్సను తీసుకొని చక్కని ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు, జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ టి.భాగ్యకుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు వీఎస్ రావు, డి.పవన్‌కుమార్, ఎన్.సాంబశివరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ఆర్కే అయోధ్య

కొనుగోలుదారులు అప్రమత్తంగా ఉండాలి

రామవరప్పాడు: కొనుగోలుదారులు అప్రమత్తంగా ఉండాలని సీఆర్డీఏ అధికారులు హెచ్చరించారు. రూరల్ మండలం నిడమానూరులో సర్వే నెంబరు (124/4 (పీ)లో నిబంధనలకు విరుద్ధంగా వేసిన అక్రమ లేఅవుట్‌ను సీఆర్డీఏ అధికారులు మంగళవారం పొక్లయినర్‌తో ధ్వంసం చేశారు. వ్యవసాయ భూముల్లో అక్రమంగా వేసిన లే అవుట్‌లను గుర్తించి రోడ్లు, సర్వే రాళ్లను తొలగించాలని సీఆర్డీఏ కమిషనర్ వివేక్‌యాదవ్ ఆదేశాల మేరకు అధికారులు చర్యలు తీసుకున్నారు. వ్యవసాయ భూములకు అనుమతులు తీసుకోకుండా రోడ్లను నిర్మించి, ప్లాట్లుగా విడకొట్టి విక్రయిస్తున్నారని అందిన ఫిర్యాదు మేరకు లే అవుట్‌ను పరిశీలించి ధ్వంసం చేశారు.

ఔషధ తయారీలో మార్పులపై అవగాహన

మేనేజింగ్ డైరెక్టర్ అన్నం సత్యనారాయణ

పటమట(విజయవాడతూర్పు): విద్యార్థులు ఔషధ తయారీలో వచ్చే మార్పులను ఆ రంగంలో నిపుణుల ద్వారా తెలుసుకోవడం అవసరమని రీసెర్చ్ లేబొరేటరీస్ మేనేజింగ్ డైరెక్టర్ అన్నం సత్యనారాయణ అన్నారు. కేఎస్ఆర్ ఫార్మసీ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫార్మాస్యూటిక్స్-బయోటెక్నాలజీ విభాగం, జాతీయ ఔషధ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఔషధ తయారీలో నూతనంగా తీసుకువచ్చే మార్పులపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన చట్టాలతో వచ్చిన మార్పులతో మందుల తయారీలో స్వల్పమైన తప్పిదాలకు కూడా అవకాశం లేకుండా ఉంటుందన్నారు. ఉన్నత ప్రమాణాలతో మందులు తయారీ దశలోనే వచ్చిన మార్పులను తెలుసుకోవాలని సూచించారు. అనంతరం ఆయనను కళాశాల యాజమాన్యం సన్మానించింది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆచంట సునీత, కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ జి.రమణ తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఈకేవైసీ నమోదు చేయాలి

నున్న(విజయవాడ రూరల్): ఖరీఫ్ సాగు చేసిన ప్రతి రైతు తప్పకుండా ఈకేవైసీ నమోదు చేయాలని మండల వ్యవసాయాధికారి బి.రంగనాథ్‌బాబు అన్నారు. నున్నలో మంగళవారం రైతుభరోసా కేంద్రంలో రైతులతో ఈకేవైసీ చేయించిన అనంతరం ఆయన మాట్లాడారు. మండలంలోని 3,428 మంది రైతులకు 3,150 ఈకేవైసీ నమోదు చేశారని, 278 మంది రైతులు ఇంకా చేయాల్సి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందాలంటే రైతులు ఈ క్రాప్ నమోదుతో పాటు, ఈకేవైసీ నమోదు చేసుకోవాలన్నారు. మండలంలో 13,995 ఎకరాల్లో వరి సాగు జరిగిందన్నారు. గతేడాది 14,775 ఎకరాల్లో వరిపంట సాగు జరిగితే ఈ ఏడాది 13,995 ఎకరాల్లో మాత్రమే సాగు జరిగిందన్నారు. నగరానికి దగ్గరగా ఉన్న గ్రామాల్లో వ్యవసాయ భూములు వ్యవసాయేతర భూములుగా మార్చుకొంటున్నారన్నారు.



నున్న ఆర్‌బీకేలో ఈకేవైసీ చేయిస్తున్న వ్యవసాయాధికారి రంగనాథ్‌బాబు